క్లుప్తంగా

మున్సిపల్ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ర్యాలీ

నెల్లూరు(బారకాసు): మున్సిపల్ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం నెల్లూరు నగరంలో ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా ఆ యూనియన్ గౌరవాధ్యక్షుడు కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. అనంతరం సమ్మె నోటీసులను తగులబెట్టారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలపై ప్రత్యేక దృష్టి


అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ శర్మద


నెల్లూరు(బారకాసు): స్పందనలో వచ్చే అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి వాటిని సకాలంలో పరిష్కరించాలని ఎన్ఎంసీ అదనపు కమిషనర్ శర్మద ఆదేశించారు. సోమవారం నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సమావేశ మందిరంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేటాయించిన పనులను నిర్దేశించిన గడువులోపు పూర్తి చేయాలన్నారు. సమస్యలు పునరావృతం కాకుండా పరిష్కారం అందించాలని ఆదేశించారు. వచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంస్థ మేనేజర్ ఇనయతుల్లా, రెవెన్యూ అధికారిణి రాజేశ్వరి, పలు విభాగాలధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జయభారత్‌లో వాస్కులర్ సర్జరీ విభాగం


మాట్లాడుతున్న డాక్టర్ సుదర్శన్‌రెడ్డి

నెల్లూరు సిటీ : జయభారత్ హాస్పిటల్లో వాస్కులర్ సర్జరీ విభాగాన్ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వాస్కులర్ సర్జన్ డాక్టర్ సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని జయభారత్ హాస్పిటల్‌లో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ డయాలసిస్ పేషెంట్స్‌కు పిస్టులా ఆపరేషన్ చేయడానికి నరాలు దొరక్క పోయినా, అనేక సార్లు ఆపరేషన్ చేసి ఫెయిల్ అయినా ప్రత్యేక పద్ధతిలో ఆపరేషన్‌లు చేసుకునే అవకాశం ఉందన్నారు. గతంలో ఈ సర్జరీలు చేయించుకోవడానికి హైదరాబాద్, చెన్నైలకు వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు నెల్లూరులోని జయభారత్ హాస్పిటల్‌లో అందుబాటులోకి తెచ్చామన్నారు. రక్తనాళాలకు సంబంధించిన వ్యాధులు, కాళ్ల పుండ్లు, వెరనికోస్ వెయిన్స్ వారికి వైద్యం చేస్తామన్నారు. ప్రతి శని, ఆదివారాల్లో జయభారత్ హాస్పిటల్‌లో ఓపీ, ఆపరేషన్‌లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో హాస్పిటల్ మేనేజర్ గురుప్రసాద్, డిప్యూటీ మేనేజర్ వెంకటేష్, డయాలసిస్ టెక్నీషియన్స్ వాణి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని కిసాన్ నగర్, జనార్దనరెడ్డి కాలనీ, హరనాథపురం ప్రాంతాల్లో వివిధ సమస్యలతో బాధపడుతున్న రాజ్యలక్ష్మి, సుభాషిణి, అమూల్యకు రూ.6 వేల వంతున అమ్మ యూత్ ఫౌండేషన్ నిర్వాహకులు సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు రమేష్‌బాబు, కార్తికేయ, శశికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులను కలిసిన ఏపీటీఎఫ్ నేతలు

నెల్లూరు(టౌన్): నూతన సంవత్సరం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ (సర్వీసెస్) మువ్వా రామలింగం, జిల్లా పరిషత్ సీఈఓ చిరంజీవిని ఏపీటీఎఫ్ నేతలు సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. డైరీలు, క్యాలెండర్లు అందజేశారు. ఈ ఏడాదిలో విద్యావ్యవస్థలో మంచి ఫలితాలు సాధించాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, ప్రధాన కార్యదర్శి పిచ్చిబాబు, రాష్ట్ర బాధ్యులు ఎస్‌కే ఎండీ రియాజ్, జుల్ఫికర్ అలీ, కృష్ణారెడ్డి, ప్రకాష్‌రెడ్డి, జనార్దన్, జిల్లా బాధ్యులు మురళీకృష్ణ, కోటేశ్వరరావు, సుంకు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా నూతన సంవత్సర వేడుకలు


ఇందుకూరుపేట : పండ్లు, దుస్తులు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేత కల్యాణ్‌కుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట : ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలను మండల వాసులు సోమవారం ఉత్సాహంగా జరుపుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి ఒకరికొకరు న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కేక్‌లు కట్ చేయడం, స్వీట్లు పంచుకోవడం వంటి కార్యక్రమాలతో సంతోషంగా గడిపారు. యువత కేరింతలు కొడుతూ ఆనందం వ్యక్తం చేశారు. వేకువజామునే తమ ఇష్టదైవాలను దర్శించుకున్నారు. ఏడాదంతా మంచి జరగాలని వేడుకున్నారు. కొత్త సంవత్సరం సందర్భంగా గ్రామాల్లో సందడి నెలకొంది.

ఆలయాల్లో విశేష పూజలు

నూతన సంవత్సరం సందర్భంగా పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రముఖ పుణ్యక్షేత్రం గంగపట్నంలోని చాముండేశ్వరీదేవి అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

పండ్లు, దుస్తుల పంపిణీ

మైపాడు గ్రామంలో వైఎస్సార్‌సీపీ నేత దువ్వూరు కల్యాణ్‌కుమార్‌రెడ్డి జన్మదినం సందర్భంగా పేదలకు పండ్లు, స్వీట్లు, దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ శ్రీహరికోట జయలక్ష్మి, నాయకులు పాల్గొన్నారు. మైపాడు ఎస్టీ కాలనీలో దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దివ్యాంగులు కటారి యాదగిరి, రవీంద్ర, కిరణ్, సాంబయ్య, శీనయ్య, నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

నార్తురాజుపాళెంలో..

కొడవలూరు : మండలంలోని నార్తురాజుపాళెంలో ఉన్న వీసీఆర్ అతిథి గృహంలో సోమవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావును అధికారులు, నేతలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చలపతిరావు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాలు ఆనందంగా ఉన్నాయన్నారు. మళ్లీ రాష్ట్రానికి ఆయనే ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారన్నారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో తహసీల్దార్ ఈ.రమాదేవి, ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం, ఈఓపీఆర్డీ వి.డేవిడ్, ఎంపీపీ జి.జ్యోతి, సర్పంచ్ బి.సుప్రియ, ఎంఈఓ జి.వసంతకుమారి, ఏఓ లక్ష్మి, ఎంపీఎం రుక్మిణి, నాయకులు కొండా శ్రీనివాసులురెడ్డి, ఎస్.మానిక్యరావు, ఎండీ కరిముల్లా, బి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అధికారం మళ్లీ వైఎస్సార్‌సీపీదే

ముత్తుకూరు : రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి వస్తుందని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మెట్టా విష్ణువర్ధనరెడ్డి, ఎంపీపీ గండవరం సుగుణ అన్నారు. మండలంలోని తాళ్లపూడిలో కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఆయన సోమవారం 50 కిలోల కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని, కాకాణి గోవర్ధన్‌రెడ్డి మూడో సారి ఎమ్మెల్యేగా గెలుపొందుతారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, గ్రామ వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

తెలుగు బాప్టిస్ట్ చర్చిలో..

విడవలూరు : మండల కేంద్రంలోని తెలుగు బాప్టిస్టు చర్చిలో నూతన సంవత్సర వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత చర్చి పాస్టర్ బి.లూకరాజు కేక్ కట్ చేసి గ్రామస్తులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

సర్కిల్ కార్యాలయంలో..

కోవూరు: మండల కేంద్రంలోని సర్కిల్ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన టీవీ శ్రీనివాసరావు కేక్ కట్ చేశారు. పలువురు నేతలు పోలీసులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ట్రెయినీ డీఎస్పీ హేమలత, ఎస్సైలు రంగనాథ్‌గౌడ్, వీరేంద్రబాబు, పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయంలో..

కోవూరు : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నూతన సంవత్సరాది సందర్భంగా ఎంపీపీ పార్వతిని ఎంపీడీఓ శ్రీహరి, పంచాయతీ ఏఈ పరమేశ్వరలింగం, సిబ్బంది సోమవారం సన్మానించారు. పంచాయతీ కార్యదర్శులు కృష్ణమూర్తి, శివకుమార్, అశోక్ కుమార్, వెంకటేశ్వర్లు, కరుణ, హేమలత తదితరులు పాల్గొన్నారు.

పీడీని కలిసిన ఏపీవీఎస్ఓఏ నేతలు

పొదలకూరు : నూతన సంవత్సరం సందర్భంగా డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డిని నెల్లూరులోని ఆయన కార్యాలయంలో ఏపీ విలేజ్ సెక్రటేరియేట్ ఆఫీసర్స్ అసోసియేషన్(ఏపీవీఎస్ఓఏ) నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పీడీకి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ మనోజ్‌కృష్ణ, జనరల్ సెక్రటరీ సీహెచ్ జనార్ధన్, ట్రెజరర్ లోకేష్, ఈసీ మెంబర్లు హేమంత్ పాల్గొన్నారు.


కొడవలూరు : చలపతిరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న తహసీల్దార్ రమాదేవి


ముత్తుకూరు : కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు


విడవలూరు : బహుమతులు అందుకున్న చిన్నారులతో పాస్టర్ లూకరాజు


కోవూరు సర్కిల్ కార్యాలయంలో..


కోవూరు : ఎంపీపీని సత్కరిస్తున్న ఎంపీడీఓ


పొదలకూరు : పీడీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఏపీవీఎస్ఓఏ నేతలు

జగనన్న సురక్షపై ప్రత్యేక దృష్టి


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీహరి

కోవూరు : జగనన్న ఆరోగ్య సురక్ష–2 కార్యక్రమ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ శ్రీహరి అన్నారు. మండలంలోని చెర్లోపాళెం పంచాయతీ కార్యాలయ ప్రాంగణాన్ని ఆయన సోమవారం పరిశీలించారు. అనంతరం ఈఓపీఆర్డీ, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేకంగా సమీక్షించారు. ఇప్పటికే వలంటీర్లు, ఆరోగ్య సిబ్బంది వారి పరిధిలో ప్రతి ఇంటికీ వెళ్లి ఆరోగ్య పరమైన సమస్యలు ఉన్నవారిని గుర్తించి వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నట్లు చెప్పారు. ప్రజలు కూడా జగనన్న ఆరోగ్య సురక్షను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చిన్నారులకు అభినందన



నెల్లూరు(బృందావనం) : సినీ, జానపద నృత్యాల్లో ఎన్నో పురస్కారాలు, బహుమతులు అందుకున్న చిన్నారులు ఆశ్రిత్, అమితశ్రీలను ఏవీకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో జ్ఞాపికలతో అభినందించారు. నగరంలోని నర్తకిసెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకుడు కేతా సుబ్బారావు పాల్గొని, మాట్లాడారు. కోవూరుకు చెందిన నాలుగో తరగతి చదువుతున్న ఆశ్రిత్, రెండో తరగతి చదువుతున్న అమితశ్రీ 70 నుంచి 100కు పైగా ప్రదర్శనలు ఇచ్చి ఎందరో ప్రముఖుల అభినందనలు అందుకున్నారన్నారు. కార్యక్రమంలో దగ్గపాటి రాధాకృష్ణ, రఘురామిరెడ్డి, వి.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో విశేష పూజలు


బుచ్చిరెడ్డిపాళెం రూరల్: కామాక్షితాయి దర్శనానికి క్యూలైన్లలో భక్తులు

పొదలకూరు : మండలంలోని పలు ఆలయాల్లో నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం విశేష పూజలు నిర్వహించారు. పట్టణంలోని వెంకటేశ్వరాలయం, సాయిబాబా మందిరం, గీతా మందిరం, వీరాంజనేయస్వామి, శివాలయం, విఘ్నేశ్వరాలయాల్లో భక్తుల తాకిడి నెలకొంది. ప్రభగిరిపట్నంలోని శ్రీవీర అభయాంజనేయస్వామి దేవస్థానంలో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

భక్తుల కోలాహలం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయానికి సోమవారం భక్తులు పోటెత్తారు. నూతన సంవత్సరం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శనానికి రావడంతో రద్దీ నెలకొంది. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

వైభవంగా పల్లకిసేవ

కోవూరు : మండల కేంద్రంలోని కోదండరామస్వామి దేవస్థానంలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని స్వామి, అమ్మవార్లకు పల్లకిసేవ వైభవంగా జరిగింది. తొలుత అర్చకుడు శ్రీకాంతాచార్యులు ఆధ్వర్యంలో పూలంగి సేవ, విశేష అభిషేకాలు నిర్వహించారు. ఉభయకర్తలుగా శ్రీనివాసులు, వారి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.


కోవూరు : కోదండరామస్వామి దేవస్థానంలో..


పొదలకూరు : ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

వృద్ధాశ్రమంలో ఉచిత వైద్యశిబిరం

పొదలకూరు : పట్టణంలోని నర్సారెడ్డి కాలనీలో ఉన్న శ్రీలక్ష్మి వృద్ధాశ్రమంలో ట్రీస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా నెల్లూరుకు చెందిన వైద్యులు జునైద్, నిష్మా వృద్ధులకు పరీక్షలు నిర్వహించారు. శీతాకాలంలో వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

వేడిగా ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని, వేడి నీటిని సేవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ అధ్యక్షుడు నౌరాజ్ తదితరులు పాల్గొన్నారు.



వృద్ధులకు పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

నెల్లూరు (దర్గామిట్ట) : నగరంలోని జేసీ క్యాంపు కార్యాలయంలో జిల్లా రెవెన్యూ అసోసియేషన్ 2024 క్యాలెండర్, రాష్ట్ర రెవెన్యూ డైరీలను జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీఆర్ఎస్ఏ జిల్లా కార్యవర్గ అధ్యక్ష, కార్యదర్శులు అల్లంపాటి పెంచలరెడ్డి, డానియల్ పీటర్‌రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు మురళి, సతీష్, నాగరాజు, ప్రదీప్, అనిల్, గోపికష్ణ రమాదేవి, లక్ష్మి, బాలకోటమ్మ, మాధవరెడ్డి పాల్గొన్నారు.



పెన్షనర్ల సమావేశం రేపు

నెల్లూరు(బృందావనం): నెల్లూరు పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం సమావేశం హాల్లో బుధవారం సాయంత్రం 3 గంటలకు రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా శాఖ సమావేశం జరుగుతుందని ఆ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఐ.లక్ష్మీనారాయణ, పి.వెంకయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న 30 మంది సీనియర్ పెన్షనర్లను ఘనంగా సత్కరించనున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ సమావేశంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొంటారని వివరించారు.

వెంకటేశ్వరాలయంలో ధనుర్మాస పూజలు

పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో ఉన్న శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం తెల్లవారుజామున ధనుర్మాస పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాభిషేకాలు జరిగాయి.

మంత్రి చేతుల మీదుగా పింఛన్ల పంపిణీ నేడు

పొదలకూరు: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పొదలకూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు కొత్త పింఛన్లను అందజేస్తారని ఎంపీడీఓ నగేష్‌కుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి లబ్ధిదారులు హాజరుకావాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: మోటార్‌బైక్ అదుపుతప్పి ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని సర్వేపల్లి సమీపంలో సోమవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. నాయుడుపేట పట్టణానికి చెందిన మనోహర్ పని నిమిత్తం బైక్‌పై ముత్తుకూరుకు వెళ్లాడు. తిరిగి నాయుడుపేటకు బయలుదేరాడు. సర్వేపల్లి సమీపంలో కృష్ణపట్నం పోర్టు రోడ్డుపై ఆటో అడ్డురావడంతో బైక్ అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో మనోహర్‌కు గాయపడగా చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

సాగునీటి వినియోగంపై అవగాహన నేడు

కొడవలూరు: సాగునీటి వినియోగంపై కొడవలూరు ఇరిగేషన్ కార్యాలయంలో కొడవలూరు, విడవలూరు మండలాల రైతులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇరిగేషన్ ఏఈ పార్థసారథి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ఇరిగేషన్ ఉన్నతాధికారులు పాల్గొని నీటి విడుదల ఆధారంగా రైతులు ఏం చేయాలో వివరిస్తారన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి కొడవలూరు, విడవలూరు మండలాల్లోని రైతులు హాజరుకావాలని ఆయన కోరారు.

మైపాడులో కరాటే పోటీలు

ఇందుకూరుపేట : మండలంలోని మైపాడులో జిల్లాస్థాయి కరాటే పోటీలు సోమవారం జరిగాయి. ఇంటర్నేషనల్ ఫైటర్ శివకుమార్ ఆధ్వర్యంలో జరిగిన పోటీలకు వైఎస్సార్‌సీపీ నేత దువ్వూరు కళ్యాణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని కొనియాడారు. తొలుత ఆరో మైలు సెంటర్ నుంచి మైపాడు శివాలయం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. మాస్టర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.


బహుమతుల ప్రదానం

కేజ్‌వీల్స్‌తో దెబ్బతింటున్న రోడ్లు


తారురోడ్డుపై కేజ్‌వీల్స్‌తో వెళ్తున్న ట్రాక్టర్

పొదలకూరు : మాగాణి పొలాలను చదును చేసే కేజ్‌వీల్స్ వల్ల రూ.కోట్లాది నిధులు వెచ్చించి నిర్మిస్తున్న తారురోడ్లు దెబ్బతింటున్నాయి. రైతుల బాధ్యతారాహిత్యం, స్వయం నియంత్రణ లేకపోవడం వల్ల ఆయా గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు తుక్కుతుక్కు అవుతున్నాయి. రైతులు వరి నాట్ల కోసం మాగాణి భూములను కేజ్‌వీల్స్‌తో తొక్కిస్తారు. అయితే కేజ్‌వీల్స్‌ను ట్రాక్టర్ ట్రక్‌లో తరలించుకుని వెళ్లి మాగాణి పొలాల్లో దింపుకుని సేద్యం పనులు పూర్తయిన తర్వాత తిరిగి చక్రాలను ట్రాక్టర్ ట్రక్‌లోనే తరలించాలి. అయితే రైతులు మాత్రం తమ ఇష్టానుసారంగా ఇళ్ల వద్ద నుంచి ఇనుప చక్రాలను ట్రాక్టర్ ఇంజిన్లకే తగిలించుకుని తారురోడ్లపై పొలాలకు తీసుకుని వెళ్తుండడంతో రోడ్లు పాడైపోతున్నాయి. దీనికి వర్షాలు తోడవుతుండడం వల్ల రోడ్లు బాగా దెబ్బతింటున్నాయి. కేజ్‌వీల్స్‌ను పక్కా రోడ్లపై తిప్పకూడదనే నిబంధనలు ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇందువల్ల ఇటీవల నిర్మాణం జరుపుకున్న గ్రామీణ ప్రాంతాల తారురోడ్లు సైతం దెబ్బతింటున్నాయి.

స్వయం నియంత్రణ అవసరం

రైతులు స్వయం నియంత్రణ పాటించి ప్రజల ఆస్తి అయిన రోడ్లను కాపాడుకోవాల్సి ఉంది. రూ.కోట్లాది నిధులు వెచ్చించి రోడ్లు నిర్మిస్తున్నా బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం వల్ల రోడ్లు పాడైపోతున్నాయి. పాడైన రోడ్లకు మరమ్మతులు చేయించాలంటే ప్రజాధనం ఖర్చు చేయాల్సి ఉంటుంది. నిబంధనలు పాటించి వీటిని ట్రాక్టర్లలో తరలిస్తే నష్టాన్ని నివారించవచ్చు.

తీరంలో సందడే సందడి


ప్రముఖ పర్యాటక కేంద్రమైన మైపాడు బీచ్‌కు సోమవారం ప్రజలు పోటెత్తారు. నూతన సంవత్సరం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు విచ్చేశారు. దీంతో బీచ్‌లో కోలాహలం నెలకొంది.
– ఇందుకూరుపేట